


దేవునికడప చెరువులో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న సిబ్బంది


గోపవరం: వల్లంవారిపల్లె




ఖాజీపేట బస్టాండు కూడలిలో..


కడప నాగరాజుపేటలో సందడి


విగ్రహాన్ని తీసుకెళ్తున్న కడప మున్సిపల్ కార్మికులు

గంగమ్మ ఒడికి.. గణనాథుడు

- యువత కేరింతలు, భాజాభజంత్రీలు, బాణాసంచా పేలుళ్లు
- వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నదానాలు
- పటిష్ట పోలీసు బందోబస్తు

కడప (కల్చరల్), సెప్టెంబర్ 9: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా సోమవారం విఘ్ననాయకుడి నిమజ్జనం జిల్లా వ్యాప్తంగా కోలాహలంగా సాగింది. వినాయక చవితి రోజైన శనివారం బొజ్జగణపయ్య కొలువుదీరి మూడురోజులు పూజలందుకున్నాడు. గృహాలలో బుజ్జి గణపయ్యలతో పాటు ప్రధాన కూడళ్లు, వీధుల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి విగ్రహాలను చాలాచోట్ల నిమజ్జనం చేశారు. అందుకు వీలుగా జిల్లాలోని పలు ప్రాంతాలలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా కడప నగరంలోని దేవుని కడప చెరువు వద్ద స్వామివారి నిమజ్జనానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లపై ఊరేగిస్తూ వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ యువత అత్యంత ఉత్సాహంతో ఒకరి కొకరు రంగులు పూసుకుంటూ జై బోల్ గణేశ్ మహారాజ్‌కీ జై.. బైబై గణేశా అంటూ కేరింతలు కొడుతూ నిమజ్జన కార్యక్రమంలో సందడి చేశారు. మరికొన్ని ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి స్వామి సేవలో తరించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా నిమజ్జనం జరిగేచోట ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


పెద్దముడియం కుందూ నది వద్ద..


రూ.2.10లక్షలకు స్వామివారి లడ్డును వేలంలో దక్కించుకున్న సంగటి సుబ్బారెడ్డి

గణేశ్ లడ్డు రూ.2.10లక్షలు

చవితి సందర్భంగా కొలువుదీరి మూడు రోజులు పూజలందుకున్న స్వామి వారి లడ్డూలను వేలంలో భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. అత్యధికంగా పెండ్లిమర్రి మండలం మదునూరు కొత్తపేట సంగటి సుబ్బారెడ్డి రూ.2.10లక్షలకు దక్కించుకున్నారు. ఇదే మండలం నాగాయపల్లెలో భక్తులు మాజీ ఎంపీటీసీ పెద్దపుల్లారెడ్డి రూ.1.60 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. వీరపునాయునిపల్లెలో నర్రావుల రేణుకా రాంప్రసాద్‌రెడ్డి రూ.1.62లక్షలు, గోపవరం మండలం శ్రీనివాసపురంలో వింజమూరి చిన్నవెంకటసుబ్బయ్య రూ.1.61,116కు స్వామివారి లడ్డూలను వేలంలో సొంతం చేసుకున్నారు. ఖాజీపేట మండలం ఏటూరులో రూ.1.40లక్షలకు బొగ్గుల దామోదర్‌రెడ్డి, పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లె పొద నాగశ్రీనివాసులు రూ.1.35 లక్షలకు, సింహాద్రిపురం మండలంలో తుమ్మెత రవికిరణ్ కుమార్‌రెడ్డి రూ.లక్షకు, బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో మాలే సుబ్బమ్మ రూ.99 వేలకు వినాయకమయ్య లడ్డూలను వేలంలో పాడుకున్నారు.


దేవునికడప చెరువులో..


చక్రాయపేటలో..




కడపలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం




ఏడురోడ్ల కూడలి నుంచి తరలుతున్న గణపయ్యలు






నాగరాజుపేట శ్రీహరిరావు వీధిలో చిన్నారి కర్రసాము విన్యాసం

గణేశ్ నిమజ్జనంలో అపశృతి

- ఇద్దరు వేంపల్లె వాసులు మృతి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 9: మండల పరిధిలోని ఎన్.పాలగిరి క్రాస్ గోనుమాకులపల్లె మార్గమధ్యంలో ఉన్న మొగమోరువంకలో గణేశ్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు వేంపల్లె వాసులు మృతిచెందారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో వేంపల్లె గ్రామానికి చెందిన వారు మొగమోరువంక వద్దకు గణేశ్ విగ్రహాన్ని తెచ్చారు. దీనిని నిమజ్జనం చేస్తుండగా వేంపల్లెకు చెందిన బేల్దారి జారిపాటి రాజా (36), క్రిస్టియన్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వంశీ (25) ప్రమాదవశాత్తు వంకలో పడిపోయారు. వారు పడిన చోట సుడిగుండం ఉండటంతో గల్లంతయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వేంపల్లె వాసులు స్థానిక ఎస్ఐ మంజునాథ, తహసీల్దార్ లక్ష్మీదేవికి సమాచారం ఇచ్చారు. పులివెందుల అగ్నిమాపక సిబ్బంది స్థానిక గోనుమాకులపల్లెకు చెందిన మరో నలుగురు కలసి మొగమోరువంకలో దాదాపు 4గంటల పాటు గాలించి ఇద్దరి మృతదేహాలను బయటికి తీశారు. దీనితో అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బేల్దారి జారిపాటి రాజాకు నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని మృతిచెందడంతో పెద్ద దిక్కును కోల్పోయామని వారంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు వంశీ మృతిచెందడంతో అతడి తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. సంఘటన స్థలాన్ని ఆర్డీఓ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ చల్లని దొర పరిశీలించారు.



మృతులు డ్రైవర్ వంశీ, బేల్దారి రాజా (ఫైల్ ఫొటోలు)

నిమజ్జనానికి వెళ్లి వస్తూ..

చక్రాయపేట, సెప్టెంబరు 9: వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తూ అదే ట్రాక్టర్ కింద పడి ఓ బాలుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వినాయక చవితి సందర్భంగా సోమవారం భారీఎత్తున వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. ఇందులో భాగంగా ఆంజనేయపురానికి చెందిన కొందరు విగ్రహాన్ని తీసుకుని కాలేటివాగు డ్యాం వద్దకు వెళ్లారు. అక్కడ అనుమతించకపోవడంతో కుప్పం గ్రామం సమీపంలోని పాపాఘ్నిలో నిమజ్జనం చేసి వెనుదిరిగారు. మార్గమధ్యంలో నెర్సుపల్లె క్రాస్ వద్ద చిలేకాంపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని సత్తార్ స్పీడ్‌గా వెళ్లడంతో అందులో ఉన్న గౌతం అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయంలో ఆదిత్య అనే వ్యక్తి గౌతం చేతిని పట్టుకునే ప్రయత్నం చేసినా కుదరలేదు. కిందపడ్డ గౌతం తలపై ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా.. గౌతంది మదనపల్లె వద్ద ఉన్న అంగళ్లు. ఆంజనేయపురంలోని బంధువుల ఇంటిలో ఉంటూ రాయచోటి సాయి కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తాం

- ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 9: స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తామని ది ప్రొద్దుటూరు తాలూకా స్వర్ణకారుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు ఉప్పలూరు ఇలియాస్‌బాషా, కార్యదర్శి బోగా బాలవీరయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని స్వర్ణకారులు ఒకే కుటుంబంగా ముందుకు సాగాలన్నారు. స్వర్ణకారులకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. సంఘంలోని పెద్దల సూచనలతో సంఘం అభివృద్ధి, స్వర్ణకారుల సంక్షేమానికి పాటుపడుతామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. అధ్యక్షునిగా ఉప్పలూరు ఇలియాస్‌బాషా, కార్యదర్శిగా బోగా బాలవీరయ్య, కోశాధికారి టి.మౌలాలి, ఉపాధ్యక్షులు ఉప్పలూరు షేక్ మహబూబ్‌బాషా, ఉదయగిరి శివరాం, సయ్యద్ నూర్ మహమ్మద్, మహ్మద్‌హుస్సేన్, ఎస్.ఎం.దౌల, జాయింట్ సెక్రటరీలు కె.వెంకటకుమార్, కె.ఖలీల్‌బాషా, కె.శ్రీధర్, యు.అక్రం, మలయాటి క్రిష్ణ, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.


ప్రొద్దుటూరు తాలూకా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

కలెక్టరేట్‌లో స్టాఫ్‌నర్సు ఆత్మహత్యాయత్నం

- ఫిర్యాదు చేసినా పోలీసులు న్యాయం చేయలేదని ఆవేదన

న్యాయం కోసం కలెక్టరేట్ ఆవరణలో స్టాఫ్ నర్సు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తనకు వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని విషద్రావణం తాగారు. పోలీసులు ఆమెను హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. బాధితురాలు తెలిపిన మేరకు..

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 :చిన్నమ్మ అనే మహిళ 14 సంవత్సరాలుగా స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. ఏడాది పాటు కడప రిమ్స్‌లో సైతం పనిచేశారు. ఈమెకు డాక్టర్ చిన్నిక్రిష్ణ మాయమాటలు చెప్పి వివాహం చేసుకుని కాపురం చేసి కొంతకాలం తర్వాత పట్టించుకోవడం మానేశాడు. తనకు న్యాయం చేయాలని చిన్నమ్మ పోలీసుస్టేషన్లలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి డాక్టర్ చిన్నిక్రిష్ణ, డాక్టర్ తేజ్‌దీప్ వర్మ, సుజాత కలిసి ఆమెపై దాడి చేసి గాయపరిచారు. దాడికి పాల్పడిన వారిపై జిల్లా అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయంపై పలుమార్లు చిన్నచౌకు పోలీసులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో కలెక్టరేట్‌కు వచ్చి విషద్రావణం తాగానని బాధితురాలు చిన్నమ్మ తెలిపారు. ఇప్పటికైనా కలెక్టరు, ఎస్పీ కలగజేసుకుని తనను మోసం చేసిన డాక్టర్ చిన్నిక్రిష్ణ, అలాగే తనపై దాడికి పాల్పడిన డాక్టర్ తేజ్‌దీప్‌వర్మ, సుజాతలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కాగా.. విషద్రావణం తాగుతుండగా పోలీసులు అడ్డుకోవడంతో పాటు ఆమెను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ చిన్నమ్మను రిమ్స్‌కు తరలిస్తున్న పోలీసులు

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: కేరళలో ఓనం పండుగ నేపథ్యంలో కాచిగూడ నుంచి కడప మీదుగా కొల్లంకు ప్రత్యేక రైలును ఈ నెల 14తేదీ నుంచి నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 4గంటలకు కాచిగూడలో ప్రారంభమై ఎర్రగుంట్లకు రాత్రి 11.57కు కడపకు అర్ధరాత్రి 12.38కి చేరుకుంటుందన్నారు. 12.40కి బయల్దేరి రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతి మీదుగా వెళ్లి మరుసటి రోజు రాత్రి 11.20కి కొల్లం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని అన్నారు. తిరుగు ప్రయాణంలో 16న కొల్లంలో తెల్లవారుజామున 2.30కి బయల్దేరి రేణిగుంటకు రాత్రి 8.20, రాజంపేట 9.29, కడపకు 10.18, ఎర్రగుంట్ల 10.43కు చేరుకుని మరుసటి రోజు ఉదయం 9.45గంటలకు కాచిగూడ చేరుతుందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కడప పాత బస్టాండ్



- నిరుపయోగంగా బస్టాండ్ పైఅంతస్తు భవన సముదాయం
- మల మూత్ర, వ్యర్థాలతో కంపుకొడుతున్న గదులు
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్... ఆర్టీసీ అధికారులు

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 9: అది నగర నడిబొడ్డున గల ఆర్టీసీ పాత బస్టాండు. సుమారు 40 సంవత్సరాల నుంచి ప్రయాణికుల సేవలో తరిస్తోంది. ప్రతిరోజూ సుమారు 300 వందలకు పైగా వివిధ డిపోలకు (కడప-మైదుకూరు-ప్రొద్దుటూరు-జమ్మలమడుగు-బద్వేల్-రాయచోటి-పులివెందుల-రాజంపేట) చెందిన బస్సులు వస్తూ పోతూ ఉంటాయి. ఆ లెక్కన ప్రతి రోజు వేలాది మంది ప్రయాణికులు బస్సులలో ప్రయాణాలు సాగించేందుకు బస్టాండులో వేచి వుండడం పరిపాటి. కార్పొరేషన్, ఆర్టీసీ అధికారుల నిర్వాకం కారణంగా గత సంవత్సర కాలంగా బస్టాండు దయనీయస్థితిలో ఉంది.



కాంప్లెక్స్ తాపలపై పడేసిన మందుబాటిళ్లు

ప్రధానంగా బస్టాండుపై అంతస్థు భవన సముదాయం అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. మందుబాబులు పగలూ రాత్రి అనే తేడా లేకుండా పై అంతస్థు భవనాలలో తాగి తందానాలు అడుతున్నట్లు సమాచారం. వీరికి తోడు గంజాయి సేవించే వారు, పిట్ ప్యాకెట్‌గాళ్లు ఆ మత్తులో బస్టాండులో వున్న ప్రయాణీకుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో పాత బస్టాండులో ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ ఉండటంతో ప్రయాణికుల భద్రత ఉండేది.

సుందరీకరణకు నోచుకోని పాత బస్టాండు కాంప్లెక్స్

పాత బస్టాండు ఉందంటే.. ఉందన్నట్లుగా మారింది. అక్కడి భవనాల కాంప్లెక్స్ సముదాయం మల, మూత్ర విసర్జనకు నిలయంగా మారింది. దీనికితోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మందు బాబులు తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, గ్లాసులు, చెత్తా చెదారాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని సంవత్సరాలుగా బస్టాండు భవనం సుందరీకరణకు నోచుకోక అలంకారప్రాయంగా మారిందనే విమర్శలున్నాయి. బస్టాండ్‌లోని పుట్‌పాత్‌లలో కొన్ని పెచ్చులూడి ప్రమాదకరంగా వున్నాయి.

కాంప్లెక్స్ ఆదాయాన్ని గాలికొదిలేసిన కార్పొరేషన్

బస్టాండ్ కాంప్లెక్స్ గదుల సముదాయం పట్ల కార్పొరేషన్ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ఆదాయం కోల్పోతుందనే విమర్శలున్నాయి. నిరుపయోగంగా వున్న కాంప్లెక్స్ భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేసి.. ఆఫీసులకు, వ్యాపారాలకు బాడుగలకు అప్పగిస్తే కార్పొరేషన్‌కు లాభదాయకంగా వుంటుంది. ఏది ఏమైనా ఆర్టీసీ అధికారులు నెలకు రూ.70 వేలకు పైగా కార్పొరేషన్‌కు బాడుగ రూపంలో అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది. అక్కడ బస్సుల రాకపోకలు సాగించడానికి వీలుగా.. ఆర్టీసీ అధికారులు కూడా బస్టాండు స్థితిగతుల గురించి ఆరా తీయకపోవడం విడ్డూరంగా వుంది. ఇప్పటికైనా పాత బస్టాండ్ పురోగతి విషయంపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు ప్రయాణీకులు, కాంప్లెక్స్ సముదాయ భవన వ్యాపారులు కోరుతున్నారు.



బస్టాండ్ కాంప్లెక్స్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం, కుళ్లిపోయి కంపు కొడుతున్న వ్యర్థాలు

15లోగా ఈ-పంట, ఈ-కెవైసీ నమోదు చేసుకోవాలి

కడప రూరల్, సెప్టెంబర్ 9: ప్రభుత్వ ప్రయోజనాలు లభించాలంటే పంట వేసిన ప్రతి ఒక్కరు సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షల 10వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను సాగుచేశారన్నారు. అందులో ఇప్పటి వరకు 2,06,588 ఎకరాలలో ఈ- పంట నమోదుచేసి రాష్ట్రంలోనే కడప జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. ఈ-పంట నమోదు వలన రైతులకు పెట్టుబడి రాయితీ, వడ్డీలేని రుణాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాల వంటి ప్రయోజనాలు పొందడానికి వీలుపడుతుందన్నారు. పంటవేసిన ప్రతి రైతు సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ- పంటలో నమోదు చేసుకోని రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలన్నారు.

రెండురోజులుగా ఇసుక అమ్మకాలు బంద్

కొండాపురం, సెప్టెంబరు 9: మండలంలోని ఏటూరు, పి.అనంతపురం ఇసుక స్టాక్ పాయింట్లలో రెండురోజులుగా ఇసుక అమ్మకాలు బంద్ అయ్యాయి. ప్రస్తుతం ఏటూరు ఇసుకరీచ్‌లోకి గండికోట బ్యాక్‌వాటర్ చేరడం.. స్టాక్ తగినంత లేకపోవడంతో అమ్మకాలను బంద్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం సచివాలయాల వద్ద ఇసుక కూపన్లను ఇవ్వడం లేదు. మంగళవారం నుంచి రీచ్ నుంచి స్టాక్‌పాయింట్‌కు ఇసుకను డంపింగ్ చేయనున్నట్లు తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. కాగా బుధవారం నుంచి ఆన్‌లైన్ విధానంతో పాటు, యాప్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

రేపు అండర్-14 పురుషుల క్రికెట్ సెలక్షన్స్

కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 9. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 11వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు అండర్-14 పురుషుల క్రికెట్ సెలక్షన్స్ (ఎంపికలు) జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరు కావాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారులు తమతో పాటు ఆధార్‌కార్డు కాపీ, జనన సర్టిఫికెట్ (ఫారం-5) పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, 3 సంవత్సరాల ప్రోగ్రెస్ రిపోర్ట్, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్‌బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు. ఎంపికలకు 2010 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో ఘర్షణ

చాపాడు, సెప్టెంబరు 9: చాపాడు తహసీల్దారు కార్యాలయంలో సోమవారంసాయంత్రం 4.30 గంటల సమయంలో ఉద్యోగుల మధ్య ఘర్షణ జరిగింది. కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌రెడ్డికి పల్లవోలు గ్రామ వీఆర్‌ఏ లక్షుమయ్య జీతం విషయమై ఘర్షణ జరిగింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో లక్షుమయ్యకు తల వెనుకభాగంలో గాయమైంది. లక్షుమయ్యకు సంబంధించిన కొంతమంది బంధువులు కూడా సోమశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 9: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ ఏపీఎస్ఎస్ కుమారస్వామి గుప్త తెలిపారు. కావ్య, బి.సువర్ణ, డి.సాయి హర్షిత, పి.వైష్ణవి, అనుశ్రీ, పి.మహబూబ్, శివ, సి.రాకేష్, ఎస్.కిషోర్, బి.మల్లెంకొండయ్య, ఎం.కృష్ణ సాయిలు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థినిలు కాగా మిగిలిన వారు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అన్నారు. ఈనెల 14,15న కోనసీమలో జరగబోయే రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

నిమజ్జనంలోప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి : ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చాపాడు, సెప్టెంబరు 9: గణేష్ నిమజ్జనం సందర్భంగా కుందూ నది బ్రిడ్జిపై భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం ఎస్పీ సీతారామపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్ని గ్రామాల నుంచి భక్తులు విగ్రహాలు తీసుకొస్తారని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

బి.మఠం పోలీసుస్టేషన్ తనిఖీ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 9: బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ ఆవరణాన్ని, అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వినాయక నిమజ్జనాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. మండలంలో పేకాట, జూదం, మద్యపానం లేకుండా కట్టుదిట్టమైన చర్య లు చేపట్టాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

సీసీ ఫుటేజీలు బయటకు వెళ్లినందుకు సిబ్బందికి మెమోలు

చక్రాయపేట, సెప్టెంబరు 9: గండి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ అన్నదానం కార్యక్రమం సందర్భంగా జె.రెడ్డయ్య కె.రెడ్డయ్య అనే ఇరువురు వాగ్వాదం పడడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వారిని మందలించాడు. అంతటితో వంటమాస్టర్ కె.రెడ్డయ్య ఆగ్రహానికి గురై జె.రెడ్డయ్య వాటర్‌బాటిల్‌లో విషపూరిత మందు కలిపారు. దీన్ని సీసీ ఫుటేజీలో గండి సిబ్బంది పరిశీలించారు. కాగా, ఆ సీసీ ఫుటేజీలు బయటకు వెళ్లాయి. దీనిపై సిబ్బందికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. 24గంటల్లో సమాధానం ఇవ్వాలని.. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య కె.రెడ్డయ్యపై ఫిర్యాదు చేశారు.

వైవీయూను సందర్శించిన ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: వైవీయూను ఇంటాక్ జిల్లా ప్రతినిధులు సందర్శించారు. ఆర్ట్స్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బొటానికల్ గార్డెన్, జైయింట్ వాటర్‌లిల్లి అనేక రకాల మొక్కలను పరిశీలించారు. అనంతరం వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డిని ఆయన చాంబరులో కలిసి ముచ్చటించారు. విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రత్యేకతలను తెలుసుకున్నారు. లలిత కళలశాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయారావు, ఇంటాక్ జిల్లా చాప్టరు కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతి నిధులు పోతుల వెంకట్రామిరెడ్డి, సంజీవరెడ్డి, బాల యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



పీజీ ప్రవేశాల ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రారు, వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: వైవీయూ పీజీ కళాశాల ప్రవేశాల ప్రక్రియను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డిలు పరిశీలించారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించి వైవీయూలో సీటు పొందిన వారు సంచాలకుల కార్యాలయానికి వచ్చారు. డీవోఏ సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మార్గదర్శకంలో విద్యార్థుల అర్హత పత్రాలు పరిశీలన చేసి సీట్లను కేటాయిస్తున్నారు. వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లు విద్యార్థులతో మాట్లాడారు. ఇబ్బందుల గురించి ఆరా తీశారు. లక్ష్మీప్రసాద్ స్పందిస్తూ తొలివిడతలో 363 మంది విద్యార్థులు వైవీయూ కళాశాలకు అప్షన్స్ ఇచ్చుకున్నారని.. అందులో 262 మంది ఇప్పటికే ప్రవేశాలు పొందారన్నారు. ఈనెల 4 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీవోఏ సలహా సహాయ సంచాలకులు రామక్రిష్ణ, డాక్టర్ మునికుమారి, డాక్టర్ వసూ గోవర్ధనరెడ్డి, రెడ్డయ్య, డాక్టర్ గణేశ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మైలవరం నుంచి పెన్నాకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 9: మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి సోమవారం నుంచి రోజు రోజుకు నీటి విడుదల పెంచనున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం జలాశయం నుంచి గండికోట జలాశయానికి.. అక్కడి నుంచి మైలవరం జలాశయానికి నీరు వచ్చి చేరుతుండటంతో పెన్నానదికి నీటి విడు దల పెంచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. సోమవారం సాయంత్రం నుంచి 1000 క్యూసెక్కుల నీటిని పెన్నాకు విడుదల చేస్తున్నారు. అలాగే 10వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి 1000 నుంచి 3000 క్యూసెక్కుల నీటిని పెంచనున్నామని, 11వ తేది బుధవారం సాయంత్రం నుంచి 3000 నుంచి 5000 క్యూసెక్కులు, 12వ తేది గురువారం సాయంత్రం 5000 నుంచి 8500 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతుందని.. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.500 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెన్నా నదికి నీటిని విడుదల చేస్తున్నామని రెవె న్యూ అధికారులు, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తా..

- అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్



నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

వీరబల్లి, సెప్టెంబరు 9: ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధించి భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకొస్తానని అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ కొర్లగుంట నాగరాజు అన్నారు. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల విభాగంలో 390 కిలోల బరువును ఎత్తి గోల్డ్ మెడల్‌ను సాధించిన నాగరాజును సోమవారం వీరబల్లిలోని ఎస్వీకేఆర్ డిగ్రీ కళాశాలలో వీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో విజయం సాధించి గోల్డ్ మెడల్స్‌ను సాధించడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, ఎస్వీకేఆర్ కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ అవినీతిపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న విచారణ అధికారులు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 9: బద్వేలు మండలం చింతలచెరువు పంచాయతీ సర్పంచ్ ఆరెళ్ల పద్మావతి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి రవి కుమార్‌రెడ్డిలు పంచాయతీ కార్యదర్శులతో కలిసి అవినీతికి పాల్పడ్డారని బయనపల్లె గ్రామానికి చెందిన బిజివేముల వెంకటసుబ్బారెడ్డి స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం బద్వేలు ఈవోపీఆర్‌డీ ఆదినారాయణ, అట్లూరు ఈవో ఎఆర్‌డీతో కలిసి విచారణ చేపట్టారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే నిధులు వాడుకోవడం.. పనులు చేయకుండా నిధులు కాజేసినట్లు ఫిర్యాదుదారుడు వెంకటసుబ్బారెడ్డి గతనెల 18న స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జరిగిన పనులకు సంబంధించిన ఎం బుక్‌లను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే తమ వద్ద లేదంటూ పంచాయతీ సెక్రటరీ తిమ్మయ్య ఇచ్చిన సమాధాన పేపర్లను అధికారులకు చూపించినట్లు తెలిపారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు వార్డు మెంబర్ల ఇళ్లకు వెళ్లి తీర్మానాల బుక్‌లో పంచాయతీ సెక్రటరీ సంతకాలు తీసుకుంటున్నారని.. గడిచిన మూడేళ్లలో చింతల చెరువు పంచా యతీలో రూ.20 లక్షలకు పైగా అవినీతి జరిగిందని.. సమగ్ర విచారణ జరపాలని అధికారులను కోరినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. కాగా, పంచాయతీ కార్యదర్శి రికార్డులను సమర్పించేందుకు కొంత సమయం కావాలని విచారణ అధికారులను అడగడంతో.. ఈ నెల 13 వరకు విచారణ వాయిదా వేసినట్లు తెలిపారు.

288 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9: ఎర్రగుంట్లలోని వినాయకనగర్ సమీపంలో సోమవారం కడప విజిలెన్స్ ఆధ్వర్యంలో దాడి చేసి 288 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి ఆదేశాలతో ఏపి 16 టీజే 6219 నెంబరు గల లారీలో రేషన్ బియ్యం రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశారు. లారీని తనిఖీ చేయగా 288 బస్తాల పీడీఎస్ బియ్యంను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.15,92,612 ఉంటుందన్నారు. లారీని ఎర్రగుంట్ల పోలీసులకు, బియ్యాన్ని ప్రొద్దుటూరు ఎంఎల్ఎస్ వారికి అప్పగించినట్లు తెలిపారు. ఎర్రగుంట్ల మండలానికి చెందిన మందాల శివనాగేంద్ర, మందాల మహేష్‌ను అరెస్టు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ జి.బాషా, ఎర్రగుంట్ల డీటీ తేజస్వి, ఏవో బాల గంగాధర్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో మురళీక్రిష్ణ, ఆర్ఐ రమణారెడ్డి, పోలీసులు, పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, నిలువఉంచినా, అమ్మినా నేరమని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి శ్రీనివాసరావు ప్రకటన చేశారు.



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న డీటీ, ఇతర అధికారులు



కడప: విజయదుర్గా కాలనీలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపు దృశ్యం



కమలాపురంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణపయ్యలు



దేవుని కడప చెరువులో వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు



చెన్నూరు: కేసీ కాలువలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పునరాగమనాయచ..

● వాడవాడలా వేడుకగా నిమజ్జనోత్సవం ● పోటాపోటీగా లడ్డూ వేలం ● పాల్గొన్న ఆబాల గోపాలం



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. అనంతరం ప్రత్యేక వాహనాలపై గణేశుడిని ఆసీనుడిని చేసి, మంగళవాయిద్యాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, బాణసంచా వేలుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు.

కడప(రూరల్) సెప్టెంబరు9: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుమూరి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు లంకా మల్లేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన 20 అడుగుల వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూను టైపిస్టు శ్రీనివాసరాజు రూ. 37 వేలకు వేలంలో దక్కించుకున్నారు. జడ్పీ సీఈవో ఎం. సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, ఏపీపీఆర్ ఎంఈఏ నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, ఏవోలు భాస్కర్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు. 50వ డివిజన్‌లోని రూకావారిపల్లెలో టీడీపీ నేత పాలంపల్లె రామగంగిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, శివారెడ్డి సుగవాసి యువరాజ్, పోలీస్ సంఘం మాజీ అధ్యక్షుడు ఉత్తమారెడ్డి, ఏపీపీఆర్‌ఎంఈఏ మాజీ ప్రధాన కార్యదర్శి బండపల్లి నాగభూషణం, శ్రీనివాసులు, చాట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కడప (ఎడ్యుకేషన్): కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు అమీర్‌బాబును సన్మానించారు. టీడీపీ నాయకులు మేకల వెంకటేశ్‌యాదవ్, శ్రీరాములు, నాసర్ ఆలీ, డాక్టర్ వర కుమార్, మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ చెన్నంశెట్టి మురళి పాల్గొన్నారు.

కడప కల్చరల్: బిల్టప్ సమీప విజయదుర్గ కాలనీ 4 వ రోడ్డులో వినాయకుడి విగ్రహ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కాలనీ ప్రముఖులు గోవిందు నాగరాజు, ఆర్. సుధాకర్, కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, సిఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, రాజారెడ్డి, తిమ్మారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బన్న, గుత్తి వేణు, రఘునాథ్‌నాయుడు, సారథ్యంలో వినాయకుడి ఊరేగింపు కార్యక్రమం అట్టహాసంగా సాగింది. రామాంజనేయపురం జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేలంలో స్వామివారి లడ్డును ఆ ప్రాంతానికే చెందిన గంగయ్య 21 వేలకు దక్కించుకున్నారు.

చెన్నూరు: చెన్నూరు కేసీ ప్రధాన కాల్వలో సోమవారం సాయంత్రం గణనాథుడిని నిమజ్జనం చేశారు. అంతకు ముందు యువత ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వల్లూరు: వల్లూరులో ఎస్ఐ సంజీవరావు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

వేంపల్లె: వేంపల్లె మండలంలో వినాయక విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాల మధ్య రంగులు చల్లుకుంటూ నందిపల్లె సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

సికెదిన్నె: చింతకొమ్మదిన్నె మండలంలోని 84 గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

చక్రాయపేట: మండలంలోని కొండవాండ్లపల్లె, ఓబులనాయునిపల్లె, హరిజనవాడ, చక్రాయపేట, ఆంజనేయపురం, హరిజనవాడ, గొర్లపల్లె, చిలేకాంపల్లెతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కాలేటివాగులో కొందరు, గండి పాపాఘ్ని నీటిలో నిమజ్జనం చేశారు.

కమలాపురం రూరల్: మండల పరిధిలోని కమలాపురం, చదిపిరాళ్ల, పైడిమానుకాలనీ గోపులాపురం, గొల్లపల్లె, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి కుందూనదికి తరలి వెళ్లారు. చదిపిరాళ్ల, కమలాపురం, శ్రీనగర్ కాలనీ అడ్డరోడ్డుతో పాటు పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

పోటాపోటీగా లడ్డు వేలం

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలో నర్రావుల రేణుక రాంప్రసాద్ రెడ్డి రూ.1,62,000కు, బీసీ కాలనీలో వెంకటకృష్ణ రూ.51,500, సర్వరాజుపేట కాలనీకి చెందిన జయచంద్రారెడ్డి రూ. 34,000 లడ్డు దక్కిచుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల మధ్య ఇంటి వరకు భక్తులను తీసుకెళ్లారు. సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత వివి సుబ్బానాయుడు, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాఘవ, కమిటీ సభ్యులు రాంప్రసాద్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, ఓబులేస్‌యాదవ్, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

సింహాద్రిపురం: సింహాద్రిపురంలో మేదా స్కూల్ వీధిలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. జెండా లయన్స్ గణేష్ ఉత్సవ్ కమిటీ నిర్వహించిన వేలంలో కుమ్మెత రామకృష్ణారెడ్డి(తుఫాన్) కుమారుడు రవి కిరణ్ కుమార్‌రెడ్డి లక్ష రూపాయలకు గణేశ లడ్డును దక్కించుకున్నారు. వైఎస్సార్ సర్కిల్‌లోని వినాయకుని వద్ద నిర్వహించిన వేలంలో భూమనపల్లి శ్రీనివాసరెడ్డి, ప్రవీణా దంపతుల కుమారుడు బి. నిఖిల్‌కుమార్‌రెడ్డి రూ.35 వేలకు స్వామి వారి లడ్డు ప్రసాదం దక్కించుకున్నాడు. అంకాళమ్మగూడూరు కొత్తపాళెంలో కటికిరెడ్డి వంశీధర్ రెడ్డి రూ.15 వేలకు స్వామివారి లడ్డు దక్కించుకున్నాడు.

పెండ్లిమర్రి: గణనాథులను భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కొన్ని గ్రామాలలో లడ్డు వేలం నిర్వహించగా నాగయ్య పల్లెలో రూ.1.60లక్షలు, మదునూరు కొత్తపేట గ్రామంలో రూ.2.10 లక్షలకు దక్కించుకున్నారు. గ్రామాలలో కూడా వేలం పోటాపోటీగా సాగింది.

దొడ్డపనేని కుటుంబ సభ్యులకు సన్మానం

కడప (ఎడ్యుకేషన్): కడప నగరం ఎన్జీవో కాలనీలోని గణేశ విగ్రహం వద్ద దొడ్డపనేని కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం దొడ్డపనేని రాజా, చంద్రశేఖర్‌నాయుడు కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధుసూదనరెడ్డి, హేమంత్ నాయుడు, రాంప్రసాదరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు



కాంతినగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు



రామాంజనేయపురం జర్నలిస్టు కాలనీలో లడ్డు దక్కించుకున్న భక్తుడు



కడపలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కడప: దొడ్డపనేని కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కమిటీ పెద్దలు



సింహాద్రిపురంలో లడ్డూ దక్కించుకున్న రవి కిరణ్‌రెడ్డి కుటుంబీకులు.

జేవీవీ జిల్లా అధ్యక్షుడుగా సమీర్‌బాషా



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడుగా సమీర్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం జేవీవీ వార్షిక సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సమావేశంలో వైవీయూ ప్రొఫెసరు వెంకట్రామిరెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శనరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కార్యద ర్శిగా ఉపాధ్యక్షుడుగా, కోశాధికారిగా జనవిజ్ఞాన వేదిక అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించి అధ్యక్షుడిగా ఏకగ్రీవం గా ఎన్నిక చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సికెదిన్నె, సెప్టెంబరు 9: చింతకొమ్మదిన్నె గంగమ్మగుడికి హుండీ ద్వారా రూ.63,807 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్తపేట సమీపంలోని గంగమ్మ గుడిలో సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, భక్తుల సమక్షంలో హుండీని తెరచి లెక్కించారు. ఈ మొత్తాన్ని గంగమ్మ గుడి దేవస్థానం అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు వెంకటసుబ్బారెడ్డి, పుల్లయ్య, బుసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఉషారాణి, బి.వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మహా పూర్ణాహుతి

కడప (కల్చరల్) సెప్టెంబరు 9: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బెల్లంమండి వీధిలోని ప్రసన్న విఘ్నేశ్వరాలయంలో సోమవారం ఉదయం బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ ఆధ్వర్యంలో వాంఛ కల్పలత వైనాయకి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

● అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 : ప్రజల సహకారంతో కడప మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రం తెలిపారు. సోమవారం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణం పరిష్కరించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనరు శ్రీనివాసులు, ఎంహెచ్‌వో చంద్రశేఖర్, సిటి ప్లానర్ సూరజ్, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనరు

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఇన్‌చార్జి ఆర్డీవో

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 9: సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలన్నింటినీ సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఇంచార్జి ఆర్డీవో వెంకటపతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కడప ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతితో పాటు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జడ్పీ సీఈవో సుధాకర్ రెడి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓ పెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకటపతి

మైలవరం దక్షిణ కాల్వ నుంచి నీరివ్వాలి

కమలాపురం రూరల్: వర్షాభావం కారణంగా జిల్లాలోని చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయిందంటూ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పాపాఘ్నినది పారినప్పుడు కట్టుగొమ్మ కాల్వ ద్వారా కమలాపురం, చదిపి రాళ్ల చెరువులు నిండేవని, ఈ సారి పాపాఘ్నినది పారలేదన్నారు. మైలవరం జలాశయం దక్షిణ కాల్వ ద్వారా కమలాపురం చెరువును నింపితే కమలాపురం మండలంలో 3వేల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కట్టయానాదయ్య, కమలాపురం మండల సీపీఐ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత సేవా దృక్పథం అలవరచుకోవాలి

చెన్నూరు, సెప్టెంబరు 9 : యువత సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. చెన్నూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో టీడీపీ యువ నేత గుగ్గిళ్ల చాణక్య అందించిన రూ.50 వేల విలువైన వైద్య పరికరాలను సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సాగరకుమారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల సేవకు ఎలాంటి సేవ చేసినా అది తక్కువేనని, వారి బాగు కోసం చాణక్యలాంటి యువకులు ముందుకు రావాలన్నారు. అనంతరం వైద్యశాలను పరిశీలించారు. మండల టీడీపీ కన్వీ నరు కె.విజయ భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి పవన్, యువత అధ్యక్షుడు సుదర్శనరెడ్డి, వార్డు సభ్యుడు శ్రీకాంత్, బీసీ నేత ఆటోబాబు, మైనార్టీ నేత షబ్బీర్, శ్రీకాంత్‌రెడి, వైద్యుడు డాక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.



వైద్యపరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వక్ఫ్ ఆస్తులు బోర్డు పరిధిలో ఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 9: వక్ఫ్‌బోర్డు ఆస్తులు వక్ఫ్ బోర్డుపరిధిలోనే ఉండాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన వక్ఫ్‌బోర్డు రద్దు బిల్లుకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వక్ఫ్‌బోర్డు రద్దు చేస్తూ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ రోజు ముస్లింలకు తర్వాత హిందువులు, క్రిస్టియన్‌ల ఆస్తులనుకూడా ఆక్రమించి అదాని, అంబానీలాంటి కార్పొరేట్ సంస్థలకు అమ్మిపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు అహమద్, బాబ్జి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల, సెప్టెంబరు 9: మండలంలోని దొండ్లవాగు, తేర్నాంపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వాచ్‌మెన్, ఆయాలు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 9 : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు ఐదు నెలలు, వాచ్‌మెన్లకు ఆరు నెలలుగా పెండింగులో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం స్పందనలో జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు ఆయాలు, వాచ్‌మెన్లకు జీతాలు అందక చిరుద్యోగులు విలవిలలాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నెలంతా పనిచేస్తే వచ్చేది రూ.6వేలు మాత్రమేనని, అది కూడా పెండింగు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీబాదుల్లా, జిల్లా కార్యదర్శులు చాంద్‌బాషా, లింగన్న, నగర కార్యదర్శి మద్దిలేటి, ఆయా యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

రిమ్స్‌లో బీఎన్ఆర్ ఫౌండేషన్ అన్నదానం

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 9: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని బీఎన్ఆర్. ఫౌండేషన్ చైర్మన్ బీచు నరేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు బేచు ధన్విత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వివిధ వ్యాధులతో కడప రిమ్స్‌కు వచ్చే బాధితులకు, వారి సహాయకులకు కాసింత సాయం చేయాలనే లక్ష్యంతో నాగేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రతి నెల రెండవ సోమవారం రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అందులో భాగంగా సోమవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రిలో సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వలంటీర్లు ఎం. శ్రీనివాసులురెడ్డి, వై. హరినారాయణరావు, ఎం. హరికృష్ణ, నారాయణ,

'విద్యారంగ సమస్యలపై ఉద్యమిద్దాం'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 : విద్యారంగ సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయడంలేదని, ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయకుండా కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తే రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమం మొదలవుతుందని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ హెచ్చరించారు. సోమవారం కడప నగరంలోని తన కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగినా అరకొర నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనరు సగిలి రాజేంద్రతో పాటు అబ్దుల్లా, ఆసిఫ్, వై.చరణ్, ముబారక్, అన్వర్‌బాషా, నవీన్, అజ్మతుల్లా, సుభాన్, సందీప్ పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయం తప్పక సందర్శిస్తా : కెనరా బ్యాంకు ఎండీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 :కడప నగరంలో ఉన్న బ్రౌన్ గ్రంథాలయాన్ని తాను తప్పక సందర్శిస్తానని ప్రముఖ జాతీయ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరు సత్యనారాయణ రాజు తెలిపారు. సోమవారం బెంగుళూరు కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సత్యనారాయణ రాజును బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యనారాయణరాజుకు సత్కరించారు. అనంతరం బ్రౌన్ గ్రంథాలయం సందర్శించి అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. దీనికి కెనరా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరు కేఎస్ఎన్ రాజు స్పందిస్తూ వేమనను వెలుగులోకి తేవడంలో బ్రౌన్ అవిరళ కృషి మరువలేనిదన్నారు. వేమన పద్యాలు ముద్రించి ప్రచారం చేసి ఆంగ్లంలోకి అనువాదం చేసిన భాషా సేవకుడు బ్రౌన్ అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషి కొనియాడారు. తాను కూడా సహకరిస్తానని, అలాగే గ్రంథాలయాన్ని త్వరలో సమీక్షిస్తానని తెలిపారు.

యూరియా ఏదైనా పోషకాలు ఒక్కటే..

చెన్నూరు, సెప్టెంబరు 9: యూరియా ఏదైనా అన్ని పోషకాలు సమానమేనని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న యూరియా గుళికలు లావుగా ఉండడంతో వాటిలో పోషకాలు తక్కువగా ఉంటాయన్నది అపోహ మాత్రమేనని సోమవారం రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రస్తుతం 40 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆమె తెలిపారు. లైసెన్సుడు డీలర్ల వద్ద కూడా 30 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఖరీఫ్ సీజనులో చెన్నూరుతో పాటు రామనపల్లె, గుర్రంపాడు, కొండపేట, ముండ్లపల్లె రాచిన్నాయల్లె, చిన్నమాచుపల్లె తదితర ప్రాంతాల రైతులు లావు యూరిఆయను ఎలాంటి సంకోచం లేకండా వాడుకోవచ్చన్నారు. లావుగా ఉన్న యూరియా నల్లరేగడి భూముల్లో నిదానంగా పూర్తిస్థాయిలో నత్రజని అందిస్తుందని తెలిపారు. రెండింటిలో 46 శాతం నత్రజని ఉంటుందన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ కంపెనీ లావు యూరియా సరఫరా చేస్తుందని గతంలో ఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ మూత బడడంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న లావు యూరియాను ప్రతి రైతు నిస్సంకోచంగా వాడుకోవాలన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉన్న యూరియా బస్తాలను వ్యవసాయాధికారి పరిశీలించి సోమవారం పంపిణీ చేశారు. అలాగే రైతులు కూడా పలువురు లావు యూరియాను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

మాదకద్రవ్యాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు

వల్లూరు, సెప్టెంబరు 9 : మత్తు పదార్థాలకు అలవాటుపడితే బంగారు జీవితం చేజేతులా నాశనం చేసుకున్నట్లవుతుందని ఎస్ఐ సంజీవరాయుడు అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా సోమవారం మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సహకారంతో మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూలు, కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోమియోపతి డాక్టర్ షాకీర్‌హుసేన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతున్నారన్నారు. ఎస్ఐ సంజీవరాయుడు మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పానీయాలకు అలవాటు పడి బంగారు జీవితాన్ని చేతులారా నాశనం తెచ్చుకోవద్దన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసేవారు కానీ, వాటికి అలవాటుపడ్డ వారు కానీ శిక్షార్హులన్నారు. అనంతరం ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, శూలం లక్ష్మీదేవి, వసంత్, అశోక్, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 : ఖాజీపేట మండలం మాదిగవాడలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఫౌండేషన్ ఫర్ బయోలాజికల్ సెక్యూరిటీ క్లస్టర్ కోఆర్డినేటరు లావణ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా వేదికలోలో ఆమె వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాజీపేట మండలం మాదిగవాడలో దాదాపు 80 కుటుంబాలు నివసిస్తున్నాయని, శ్మశాన వాటిక లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలోని పోరంబోకు భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది పూర్తి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9 :చంద్రబాబు అక్రమ అరెస్టుకు సెప్టెంబరు 9 నాటికి ఏడాది పూర్తయిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. 53 రోజుల పాటు జైలులో పెట్టి చంద్రబాబును ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఇంత అరాచకంగా చేసినందుకు తగిన మూల్యం చెల్లించుకుందని స్పష్టం చేశారు.

కరెంటు కోతలు తగ్గించాలి

చక్రాయపేట, సెప్టెంబరు 9: నిరంతర కరెంటు కోతలపై యార్లవాండ్లపల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేశారు. విద్యుత్ కోతలతో గణపతి పూజలు సక్రమంగా చేయలేక పోయామన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి యార్లవాండ్లపల్లెలో కరెంటుకోత లేకుండా చేయాలని కోరారు.

గులాబి రంగు పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 9: పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం తిప్పిరెడ్డిపల్లెలో వ్యవసాయ శాఖ , కేవీకే అధికారులు, శాస్త్రవేత్తలు పత్తి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిలో గులాబి రంగు నివారణకు ప్రొఫినోఫాస్ 2మిల్లీలు లేక క్లోరోపైరిఫాస్ 2.5మిల్లీలు లేక క్వినాల్‌ఫాస్ 2మిల్లీలను పిచికారీ చేయాలని తెలిపారు. పంటను తీయదలచిన వారు రోటావేటరుతో భూమిలో కలియదున్నాలన్నారు. లేక గొర్రెలు, మేకలను మేపాలన్నారు. అలా చేయకుంటే ఈ పురుగు తర్వాత వేసే పంటలో ఉధృతంగా వచ్చే అవకాశం ఉందన్నారు. లేత పంటలో ఎకరాకు నాలుగు ఎరబుట్టలు అమర్చి 45 రోజుల దశ నుంచే పురుగును గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు, సిబ్బంది గంగాధర్‌రెడ్డి, కృష్ణచైతన్య, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 9: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. సోమవారం కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల లైసెన్సుకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, సెప్టెంబరు 9: జమ్మలమడుగు డివిజన్ పరిధిలో జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సంబంధించి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు టపాసుల లైసెన్సుకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి దీపావళి పండుగ టపాసుల కొత్త లైసెన్సుకు ఫారం-ఎల్ఈ5లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ఫారం-ఎల్ఈ5 లైసెన్సులు పొందినవారు తదుపరి రెన్యువల్‌కు ఫారం-ఆర్ఈ-1తోపాటు చలానా చెల్లించి 20.10.2024వ తేదీలోగా రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు సూచించిన ప్రదేశంలోనే టపాసులు అమ్ముకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర స్థలాల్లోకానీ, వేరే ప్రదేశాల్లో విక్రయించరాదన్నారు.

గులాబీరంగు పురుగును నివారించాలి

ఖాజీపేట, సెప్టెంబరు 9: పత్తిపంటలో గులాబీరంగు పురుగును నివారించాలని ఏడీఏ రమణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తవ్వారుపల్లెలో సాగు చేసిన పంటను శాస్త్రవేత్త వీరయ్య, ఏవో నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గులాబీరంగు పురుగును నివారించేందుకు క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి రెండు ఎంఎల్ లేదా క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి 2.5 ఎంఎల్. లేదా ప్రొపినోఫాస్ లీటరు నీటికి రెండు ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. అంతేకాక పత్తిపంటలో ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తవ్వారుపల్లె రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.మఠం ఇన్‌చార్జి తహసీల్దారుగా రాజసింహ నరేంద్ర



బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 9 : బ్రహ్మంగారిమఠం మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా రాజసింహ నరేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు దామోదర్‌రెడ్డి వరద సహాయ చర్యలపై విజయవాడకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. మండలంలో భూసమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి రైతన్నలు తీసుకునిరావాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజసింహ నరేంద్ర తెలిపారు.

ఉమ్మడిశెట్టి సుబ్బరాయుడుకు ఘన నివాళి



ఉమ్మడిశెట్టి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

ముద్దనూరు సెప్టెంబరు9: ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త,మాజీ జడ్పీటీసీ,మాజీ ఎంపీపీ. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు దివంగత ఉమ్మడిశెట్టి సుబ్బరాయుడు తృతీయ వర్ధంతిని ఉమ్మడిశెట్టి కుటుంబ సభ్యులు సురేష్, సుధాకర్, సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముద్దనూరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడిశెట్టి విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.అనంతరం ముద్దనూరులోని మానసిక వికలాంగుల (ఏసుకరుణాలయం) ఆశ్రమం,ప్రొద్దుటూరు సమీపంలోని విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తల్లి, బిడ్డకు క్షేమం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 9 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. సోమవారం పలుగురాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు పీఎంఎస్ఎంఏ ప్రోగ్రాం కింద బీపీ, షుగరు, రక్తపరీక్షలు చేసిన అనంతరం తగిన సలహాలు సూచనలు తెలిపినట్లు డాక్టర్ రవిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పీరయ్య, వై.వెంకటసుబ్బమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం







ఖాజీపేట, మైలవరంలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు, ప్రొద్దుటూరులో ఆకట్టుకున్న మహిళల కోలాటం

బద్వేలు, సెప్టెంబరు 9 : వినాయకుని నిమజ్జనోత్సవాలు బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. యువత ఉత్సాహంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. లంబోదరుడు మూడు రోజులపాటు ప్రజల పూజలందుకున్నారు. వాడ వాడలా వెలసిన వినాయకునికి భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో గణేశుని పూజించారు. గంగవడికి చేరేందుకు బయలుదేరిన గణనాథుడిని బాణాసంచా పేలుళ్లు, వసంతాలు చల్లుకుంటూ, డప్పు వాయిద్యాలకు తన్మయంతో నృత్యాలు చేస్తూ భక్తగణాలు వెంట నడవగా గణనాథుని నిమజ్జన సంబరం నింగినంటింది. గణేశుడి నిమజ్జనోత్సవం కన్నుల పండువగా జరిగింది. పలు ప్రాంతాల్లో వెలసి ఉన్న విఘ్నేశ్వరుడి ప్రతిమల్లో సోమవారం చాలా వరకు గంగవడికి చేరాయి. గణేశ్ పందిళ్లవద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలంపాటలు నిర్వహించారు.

ప్రశాంతంగా వినాయకుని నిమజ్జనం..: వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా బద్వేలు పట్టణంలో చాలా వరకు పెద్ద చెరువులో స్వామివారిని నిమజ్జనం చేశారు. అలాగే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. చాలావరకు విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘనంగా గణనాథుని లడ్డూ వేలం పాట..: పట్టణంలోని నెల్లూరు రోడ్డు, ఆంజనేయనగర్, కొండారెడ్డి వీధులలో వెలసిన వరసిద్ధి వినాయక మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాట కన్నులపండువగా జరిగింది. ఇందులో భాగంగా బద్వేలు మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ మాలే రామచంద్రారెడ్డి తల్లి మాలే సుబ్బమ్మ రూ.99,000లకు దక్కించుకున్నారు. అలాగే చెరకు గడలు రూ.7వేలకు బత్తల వెంకటసుబ్బయ్య, దేవుని హుండీ రూ.6వేలకు పి.శివారెడ్డి దక్కించుకోగా వెండి కుంకుమ భరిణను రూ.18వేలకు పెద్దిరెడ్డి బుజ్జమ్మ, అలాగే కలశపు వెండి చెంబు 45 వేలకు కొండు దివాకర్‌రెడ్డి వేలం పాట ద్వారా కైవసం చేసుకున్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీర్చిన గణనాథులను ఉత్సవ కమిటీల నిర్వాహకులు సోమవారం నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం కొన్ని ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో రంగులు చల్లుకుంటూ పురవీధుల్లో ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. ఉట్టికొట్టడం, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. వినాయక విగ్రహాలను కామనూరు వద్ద కుందూ నది, చాపాడు సమీపంలోని పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

మైలవరం..: మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం, దన్నవాడ, కమ్మవారిపల్లి, తదితర గ్రామాల్లో సోమవారం వైభవంగా వినాయకుల నిమజ్జనం చేశారు.ఆయా గ్రామాల్లోని కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూను వేలం పాట వేశారు. గ్రామాల సమీపంలోని చెరువులు, కాలువలు, వంకల వద్ద గణనాథులను నిమజ్జనం చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

బద్వేలు రూరల్..: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అనేక ప్రాంతాల్లో వినాయకవిగ్రహాలు మేళతాళాలు, బాణసంచా పేల్చుతూ యువకుల కేరింతలతో నిమజ్జనానికి తరలివెళ్లాయి. అర్బన్ సీఐ రాజగోపాల్‌యాదవ్ పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్లలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా రెడ్డినగర్‌లో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే రాత్రి హైదరాబాదు నుంచి వచ్చి జబర్దస్త్ కామెడీ టీం నిర్వహించిన షో అందరిని నవ్వుల్లో ముంచెత్తింది. నడిపూరులో వందన బృందం చేత నిర్వహించిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఏరువాక గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద చిన్నారుల కోసం నిర్వహించిన మ్యాజిక్ షో, మిమిక్రీ షో చిన్నారులను ఆకట్టుకున్నాయి. వినాయక మంటపాల వద్దకు వచ్చిన భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కాగా కొన్ని వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ముద్దనూరు..: మండలంలో కొలువుదీరిన వినాయకులు సోమవారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. బ్యాండు వాయిద్యాల మధ్య రంగులు జల్లుకుంటూ ఊరేగింపుగా వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

పోరుమామిళ్ల..: వినాయకచవితి సందర్భంగా కమ్మవారిపల్లెలో గణనాథుని వద్ద ఉంచిన లడ్డూ రూ.1.35లక్షలు ధర పలికింది. సోమవారం పోరుమామిళ్లలో రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల వద్ద ఉన్న లడ్డూను వేలం పాట వేశారు. కమ్మవారిపల్లెలో పొద రమణయ్య కుమారుడు పొద నాగశ్రీనివాసులు రూ.1.35 లక్షలకు గణపతిలడ్డూను పాట పాడి దక్కించుకున్నారు. అలాగే సాయంత్రం రెడ్డినగర్, వెంగమాంబనగర్, వినాయకనగర్, రెడ్డినగర్-3, వెంకటేశ్వర హైస్కూలు సమీపం, వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చే శారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వినాయక నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సోమవారం ఆయన పోరుమామిళ్లలో గణేశ్ నిమజ్జనం చేసే మల్లకతవ ప్రాంతాల్లో పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు ఇచ్చారు.

పెద్దముడియం..: మండల కేంద్రం పెద్దముడియం, పాలూరు గ్రామాల మధ్య కుందూపై ఉన్న నూతన వంతెన వద్ద గణనాథుల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆర్డీఓ శ్రీనివాస్, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి డిప్యూటీ తహసీల్దారు గౌసియా, ఎంపీడీవో వెంకటరమణ, ట్రాన్స్‌కో అధికారులు వారి వారి శాఖల సిబ్బందితో అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆర్డీవో, రూరల్ సీఐలు దగ్గరుండి నిమజ్జనం సమయంలో ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా సూచనలు సలహాలు ఇచ్చారు. పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం మండలాల నుంచి భారీ ఎత్తున గణనాథుని నిమజ్జనానికి భక్తులు పెద్దసంఖ్యలో వినాయక ప్రతిమలతో తరలివచ్చారు.

జమ్మలమడుగు..: పట్టణంలోని తాడిపత్రి రోడ్డు, బాలాజీ హైస్కూలు వద్ద నుంచి తేరు రోడ్డు మీదుగా నారాపురం వేంకటేశ్వరస్వామి, పలగాడి వీధి, మెయిన్‌బజార్, పాత బస్టాండు మీదుగా విగ్రహాలను పెద్దముడియం మండలం కుందూ నదికి తరలించారు. ఈ సందర్భంగా భక్తులు, యువకులు, విద్యార్థులు, మహిళలు రంగులు చల్లుకుంటూ వినాయక విగ్రహాల వెంట సంతోషంగా సందడితో తరలి వెళ్లారు.

అట్లూరు..: మండలంలో ఊరూరా కన్నులపండువగా సోమవారం సాయంత్రం గణనాథుని ఊరేగింపు నిర్వహించారు. కుంకుమలు చల్లుకుంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా భక్తిశ్రద్ధలతో సిద్దవటం సమీపంలోని పెన్నానదిలో మండలంలో 55 విగ్రహాలు నిమజ్జనానికి తరలించినట్లు అట్లూరు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు.

కొండాపురం..: పట్టణంతో పాటు తాళ్లప్రొద్దుటూరు, చౌటిపల్లె, గండ్లూరు, ఓబన్నపేట తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. కొన్నిచోట్ల లడ్డూ వేలం పాటను నిర్వహించారు. చాలాచోట్ల అన్నదానం నిర్వహించారు. అనంతరం గణనాథులను గండికోట బ్యాక్‌వాటర్‌లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు.కాగా కొండాపురం సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద కొలువుదీరిన 18 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం నిర్వహించనున్నారు.కాగా మండలంలోని తిరుమలాయపల్లె గ్రామంలో రూ.52,000కు గణేశుని లడ్డూను రమేష్,సురేష్ దక్కించుకున్నారు.

బ్రహ్మంగారిమఠం..: మండలంలో వివిధ గ్రామాల్లో వినాయకులు అధిక సంఖ్యలో నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. అలాగే ఐదోరోజు మరికొన్ని వినాయకవిగ్రహాలు నిమజ్జనానికి వెళతాయి. యువకులు డప్పువాయిద్యాలు చిందులు, బాణసంచాలతో నిమజ్జనం చేపట్టారు.

చాపాడు..: మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిలో సోమవారం ఆర్టీపీపీ ధర్మల్, ప్రొద్దుటూరు, మైదుకూరు, చాపాడు మండలాల్లోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వినాయక విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు. అల్లాడుపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు గోసుల కృష్ణారెడ్డి, పెరుగు నారాయణ, గుత్తి వీరనారాయణ భక్తులకు అన్నదానం చేశారు. నదిపై ఉన్న బ్రిడ్జిపై పోలీసులు భద్రతకోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు.

బద్వేలుటౌన్..: వినాయక చవితి పండుగ మండపాల వద్ద లడ్డూ వేలంపాట వేశారు. అనంతరం గణనాథుని బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. మున్సిపాలిటీపరిధిలోని మొత్తం 142 విగ్రహాలకుగాను 92 విగ్రహాలు నిమజ్జనానికి వెళ్లాయి. నిమజ్జనం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని ప్రతి గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి సోమవారం మధ్యాహ్నం ఆయా గ్రామాల్లో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించి అనంతరం భారీగా బాణసంచా పేల్చుతూ వాయిద్యాల మధ్య చిందులు వేస్తూ బయల్దేరారు. కాగా ఖాజీపేట బస్టాండు కూడలిలో భారీ ఎత్తున టపాసులు పేల్చడంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిపి తిలకించారు. అంతేకాక పలు విన్యాసాలు కూడా చేశారు. అంజనేయకొట్టాలు చెరువు, ఏటూరు బ్రిడ్జి, చెన్నూరు బ్రిడ్జి, రావులపల్లె చెరువు ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జనం చేశారు. లడ్డూలు వేలం పాట వేయగా మండల పరిధిలో అత్యధికంగా ఏటూరు గ్రామానికి చెందిన బొగ్గుల దామోదర్‌రెడ్డి రూ.1.4 లక్షలు, కొత్త ఏటూరులో ఎం.మునికుమార్‌రెడ్డి రూ.66 వేలు, దుంపలగట్టులో ఎం.అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.72 వేలు, కూనవారిపల్లెలో ఆర్.బాలక్రిష్ణారెడ్డి రూ.31,500, మిడుతూరు బీసీ కాలనీలో చిట్టెం శ్రీరాములుయాదవ్ రూ.32 వేలు, రెహమత్‌ఖాన్‌పల్లెలో లక్కు సుబ్బారెడ్డి రూ.13,500 కు లడ్డూలు దక్కించుకున్నారు. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఇన్‌చార్జి ఎస్ఐ సుబ్బారావు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోపవరం..: వినాయకచవితి వేడుకల్లో భాగంగా మండలంలో సోమవారం పలు గ్రామాల్లో గంగమ్మ ఒడిలోకి గణనాధులు చేరుకున్నారు. డప్పువాయిద్యాల మధ్య నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీనివాసపురంలో వినాయకుని లడ్డూ వేలం పాట రూ.1,61,116 లతో వింజమూరు చిన్న వెంకటసుబ్బయ్య దక్కించుకున్నారు. చెరుకుగడలు రూ.10వేలకు వేలం పాట పాడి తాళ్ల రామానాయుడు దక్కించుకున్నారు.

కాశినాయన..: వినాయకుడి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పిట్టిగుంట,గొంటువారిపల్లె,ఆకులనారాయణపల్లె, కోడిగుడ్లపాడు తదితర గ్రామాల్లో వినాయకుడి నిమజ్జన నిర్వహించారు. పిట్టిగుంటలో కోలాటాలు,అన్నదానాలు పెద్దఎత్తున నిర్వహించారు. లడ్డూను పిట్టిగుంటలో బి.మాధవరెడ్డి రూ.57 వేలు, గొంటువారిపల్లెలో పి.శ్రీరాములు రూ.50 వేలు పాటపాడారు. అలాగే కలశం పిట్టిగుంటలో రూ11 వేలకు ఎం.రాజారెడ్డి దక్కించుకోగా గొంటువారిపల్లెలో కలశం రూ.లక్ష రూపాయలు పాటపాడి కందుల వెంకటరెడ్డి దక్కించుకున్నారు. అదేగ్రామంలో చెరకు గడ రూ.18 వేలు పలికింది.



ఎర్రగుంట్ల...రెడ్డినగర్‌లో ముగ్గులు వేస్తున్న మగువలు



జమ్మలమడుగు... తేరురోడ్డులో యువకుల ఉత్సాహం



బి.మఠంలో గణేశ్ నిమజ్జనంలో చిందులు వేస్తున్న యువకులు



బద్వేలు...నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



బద్వేలు.. ఎస్‌ఎల్ఎన్ సినిమా హాలు వెనక వీధిలో ఉన్న వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్న యువకులు



ముద్దనూరు...నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకులు









కాశినాయన.. పిట్టిగుంటలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు, పోరుమామిళ్ల, బద్వేల్‌లో నిమజ్జనానికి వెళుతున్న గణనాథులు, చాపాడులో అన్నం వడ్డిస్తున్న దృశ్యం





ప్రొద్దుటూరులో ఉట్టి కొడుతున్న యువకులు, కొండాపురంలో నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకులు